ప్రజాశక్తి
బుధవారం 1 అక్టోబర్ 2025
5
అనంతపురం

ఆసుపత్రి ఆవరణంలో నిరసనలో పాల్గొన్న కార్మికులు, నాయకులు

# సబ్సిడీ రుణమందేనా..?

## ఏడాదిగా నిరీక్షణ

## బిసి, ఇబిసి రుణాల కోసం ఎదురుచూపు

**ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి**

బిసి, ఈబిసికి చెందిన యువత స్వయం ఉపాధి కోసమని రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీ రుణాలను 2024-25లో మంజూరు చేసింది. ఈ మేరకు లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ కూడా ముగిసింది. కాని ఇప్పటికీ లబ్ధిదారులకు మాత్రం ఆ రుణాలు అందలేదు. సబ్సిడీ రుణమిస్తే చిరు వ్యాపారాలు ప్రారంభించుకుందామని భావించిన వారికి ఎదురు చూపులు తప్పడం లేదు. ఈ రుణాలు మంజూరు చేయిస్తామని కొంత మంది లబ్ధిదారుల నుంచి డబ్బులు కూడా వసూలు చేసిన దాఖలాలున్నాయి. డబ్బులు పోయి రుణమూ రాకపోయే అన్న చందంగా వారి పరిస్థితి తయారైంది. 2024 -25 ఆర్థిక సంవత్సరంలో స్వయం ఉపాధి పథకం ద్వారా బిసి సబ్సిడీ రుణాల మంజూరు కొరకు 3200 యూనిట్లు మంజూరు చేశారు. దీనికి రూ.30.46 కోట్లు మంజూరు చేశారు. ఈబిసి సబ్సిడీ రుణాల కోసమని 412 యూనిట్లు మంజూరయ్యాయి. రూ.3.57 కోట్లు సబ్సిడీ ఉంది. ఇక కాపు సబ్సిడీ రుణాల కింద 689 యూనిట్లు మంజూరయ్యాయి. దీనికి రూ.11.58 కోట్లు మంజూరు చేశారు. ఇక జనరిక్ మందుల దుకాణాల కోసమని 50 శాతం సబ్సిడీతో బిసిలకు 65 యూనిట్లు మంజూరు చేశారు. దీనికి రూ.2.50 కోట్లు సబ్సిడీ ఇవ్వనున్నారు. ఈబిసి జనరిక్ మెడికల్ దుకాణాలకు 69 యూనిట్లు మంజూరయ్యాయి. దీనికిగానూ రూ.2.76 కోట్లు సబ్సిడీ మంజూరైంది. మంజూరైన లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తయింది. అయితే ఇప్పటి వరకు రుణాలు మాత్రం మంజూరవలేదు. ఇక 2025-26 సంవత్సరంలో కొత్త రుణాలు ఇస్తారా లేదా అన్నది తెలియలేదు. గతేడాది మంజూరైనవే ఇప్పటికీ గ్రౌండ్ అవలేదు. మొత్తంగా జిల్లాలో 4435 యూనిట్లు మంజూరయి ఉన్నాయి. రూ.50.97 కోట్లు సబ్సిడీ మొత్తం మంజూరైంది. లబ్ధిదారులకు ఇది అందేది ఎప్పుడో చూడాల్సి ఉంది.

**సొమ్ములు పోయే రుణమూ అందకపోయే ...**

లబ్ధిదారుల ఎంపిక సమయంలో కొంతమంది దళారులు రుణమిస్తామంటూ పెద్ద మొత్తంలోనే డబ్బులు వసూలు చేశారు. సబ్సిడీలో సగానికిపైగా వారివ్వడానికి అంగీకరించిన వారూ కొంత మంది ఉన్నారు. పోతే పోయింది. ఇప్పుడు రుణమైనా అందిందా అంటే అదీ లేకుండా ఉంది. గట్టిగా అడగలేని పరిస్థితి ఉండటంతో ఏమి చేయాలో పాలుపోని పరిస్థితి నెలకొంది.

**రుణాలు మంజూరు చేయాలి : సిపిఎం నగర కార్యదర్శి వి.రామిరెడ్డి**

సబ్సిడీ రుణాల కోసం లబ్ధిదారులు ఏడాదిగా ఎదురు చూస్తున్నారు. ఆర్థిక తోడ్పాటు అందించే వ్యాపారాలు చేసుకుంటూ స్వయం ఉపాధి పొందుదామనుకున్న వారికి రుణమందకుండా ఉంది. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి లబ్ధిదారులకు రుణాలు అందించి తోడ్పాటు అందివ్వాలి.

# మోక్షమొచ్చేనా..?

## అధ్వాన్నంగా గ్రామీణ రోడ్లు- రోడ్లకిరువైపులా కంపచెట్లు

## ప్రమాదాల బారిన వాహనదారులు-ఆందోళనలో ప్రజలు

గుంతలమయంగా మారిన లోలూరు నుంచి ఆకులేడు వెళ్లే రోడ్డు

**ప్రజాశక్తి-శింగనమల**

మండలంలోని గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే రోడ్డు చాలా అధ్వాన్నంగా మారాయి. రోడ్లన్నీ గుంతలమయం కావడంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరికొందరు ప్రమాదాల బారిన పడి గాయాలపాలవుతున్నారు. ముఖ్యంగా మండల కేంద్రం నుంచి గోవిందరాయునిపేట, సలకంచెరువు, రాచేపల్లి, నిదనవాడ మీదుగా కల్లమడి గ్రామం వరకూ రోడ్డు గుంతలమయంగా మారింది. దీంతో ఈ దారిలో వెళ్లాలంటే వాహనదారులు ప్రాణాలు చేతిలో పెట్టుకుని వెళ్లాల్సి వస్తోంది. గోవిందరావుపేట కొండ కింద నుంచి గ్రామంలోకి వెళ్లేందుకు రోడ్డు సరిగా లేకపోవడంతో రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలాగే తరిమెల-కల్లుమడి మధ్యలో రోడ్డు సరిగా లేనందున ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. లోలూరు క్రాస్ నుంచి ఆకలేడు, గురుగుంట్ల, నిదనవాడ నుంచి ఆనందరావుపేట గ్రామాలకు వెళ్లే రోడ్లకు ఇరువైపులా కంపచెట్లు ఏపుగా పెరగడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కూడా కనిపించడం లేదు. దీంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇల్లూరు గ్రామం నుంచి ఏకలనాగేపల్లి, గుమ్మేపల్లి గ్రామాలకు కూడా రోడ్డు సరిగ్గా లేదు. ఆయా రోడ్లలో ఎక్కువగా గ్రామీణులు, రైతులు ప్రయాణం చేస్తుంటారు. ముఖ్యంగా రైతులు ఎప్పుడు పడితే అప్పుడు వ్యవసాయ పొలాల వద్దకు వెళ్లాల్సి ఉంటుంది. దీంతో రాత్రిళ్లు ఆయా రోడ్లపై వెళ్లాలంటే ఎప్పుడేం జరుగుతుందో అని భయాందోళన చెందాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు ఆయా మార్గాల్లో నూతన రోడ్డు వేయడంతోపాటు రోడ్డుకు ఇరువైపులా ఉన్న కంపచెట్లను తొలగించి ప్రమాదాల నుంచి కాపాడాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

### ప్రమాదాల నుంచి కాపాడండి

మండలంలోని గ్రామీణ రోడ్లు సరిగా లేకపోవడంతో వాహనదారులు, ప్రజలు ప్రమాదాల బారిన పడుతున్నారు. ముఖ్యంగా రోడ్లకు ఇరువైపులా కంపచెట్లు పెరగడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించడం లేదు. దీంతో ప్రమాదాల బారిన పడుతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి వెంటనే గ్రామీణ రోడ్లను బాగు చేయాలి

**భాస్కర్, సిపిఎం మండల కార్యదర్శి**

### విద్యార్థుల బాధలు వర్ణనాతీతం

గతుకుల రోడ్లలో విద్యార్థులు పాఠశాలలకు వెళ్లాలంటే భయాందోళన చెందుతున్నారు. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులకు బస్సులు లేకపోగా సైకిళ్లు, నడుచుకుంటూ వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్లు బాగు చేయాలి.

**సూర్యప్రకాష్, ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి**

### పొలాలకు వెళ్లాలంటే ప్రాణసంకటం

వేళకాని వేళల్లో తోటల వద్దకు వెళ్లాలంటే ప్రాణసంకటంగా ఉంది. రోడ్లన్నీ గతుకులుమయంగా మారాయి. దీంతో తోటల నుంచి గడ్డిగానీ, కూలీలను గానీ గ్రామాలకు తీసుకురావాలంటే ఎప్పుడేం జరుగుతుందో అని భయపడాల్సి వస్తోంది. ఎంత నిదానంగా వెళ్తున్నా ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రమాదాల నుంచి కాపాడాలి.

**ఎర్రిస్వామి, వ్యకాసం మండల కార్యదర్శి, శింగనమల**

# సర్వజనాసుపత్రి పారిశుధ్య కార్మికులకు వేతనాలు చెల్లించాలి

## సిఐటియు నగర కార్యదర్శి ముర్తుజా

**ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్**

అనంతపురం సర్వజనాసుపత్రిలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులకు బకాయి పడిన మూడు నెలల వేతనాలు తక్షణమే చెల్లించాలని సిఐటియు నగర అధ్యక్ష కార్యదర్శులు వెంకటనారాయణ, ముర్తుజా డిమాండ్ చేశారు. సిఐటియు ఆధ్వర్యంలో ఆసుపత్రి ఆవరణంలో పారిశుధ్య కార్మికులు మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు నగర అధ్యక్ష కార్యదర్శులు వెంకటనారాయణ, ముర్తుజా మాట్లాడుతూ శానిటేషన్ వర్కర్లు నెల వారీ వేతనంపై ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు. వారికి నెలనెలా వేతనాలు ఇవ్వకపోతే కష్టంగా ఉందన్నారు. తక్షణమే వేతనాలు చెల్లించాలన్నారు. అలాగే ప్రభుత్వం జారీ చేసిన నూతన వేతనం ఒప్పందం జీవో ప్రకారం కొత్త వేతనాలు అమలు చేసి ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఏటీఎం నాగరాజు, సిఐటియు నగర కోశాధికారి శ్రీనివాసులు, నగర ఉపాధ్యక్షులు బంగారు నాగరాజు, నగర కమిటీ సభ్యులు స్వాతి, సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# కెబిఎన్ భారత్ గ్యాస్ ఏజెన్సీ అక్రమాలు నిజమే : డిఎస్ఒ

**ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్**

బొమ్మనహాల్ మండలం ఉద్దేహాల్ గ్రామంలోని కెబిఎన్ భారత్ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు అక్రమాలకు పాల్పడినట్లు తమ విచారణలో నిర్ధారించినట్లు జిల్లా పౌర సరఫరా శాఖ అధికారి టి.వెంకటేశ్వర్లు తెలిపారు. ఆ ఏజెన్సీపై ఆయా గ్రామ ప్రజలు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో డిఎస్ఒ మంగళవారం ఆయా గ్రామాల్లోని ప్రజలను నేరుగా కలిసి విచారించారు. కెబిఎన్ ఎల్పి గ్యాస్ సరఫరా ఏజెన్సీని తనిఖీ చేశారు. రికార్డుల ఆధారంగా గ్యాస్ సరఫరా జరగలేదని, వినియోగదారులకు ఇబ్బందులు కలిగించి అక్రమాలు చేశారనిగుర్తించారు. గ్యాస్ వినియోగదారులు గ్యాస్ కోసం బుక్ చేసుకున్న వారం రోజులకు కూడా సిలిండర్లు సరఫరా చేయడంలేదని గుర్తించినట్లు డిఎస్ఒ తెలిపారు. ఏజెన్సీ సక్రమంగా తెరవడం లేదన్నారు. నిండిన సిలిండర్లు సరఫరా చేయడానికి బుకింగ్ చేసుకున్న వారికి బిల్లు రేటుకన్నా రూ.30, రూ.40 వసూలు చేస్తున్నట్లు గుర్తించామన్నారు. బుకింగ్ చేయని వారికి సిలిండర్ కావాలంటే వెయ్యి రూపాయల నుంచి రూ.1200 వరకు తీసుకుని ఇస్తున్నట్లు తమ విచారణలో తేలిందన్నారు. సెప్టెంబర్ 1వ తేదీ నుంచి 18 వరకు కంపెనీ నుంచి ఒక్క సిలిండర్ కూడా తీసుకురాకుండా వినియోగదారులకు సరఫరా చేయకుండా ఇబ్బందులకు గురి చేశారని గుర్తించామన్నారు. ఏజెన్సీ వారి సమక్ష్యంలోనే గ్రామంలో గ్యాస్ వినియోగదారుల నివాసాల వద్ద విచారించి కెబిఎన్ భారత్ గ్యాస్ ఏజెన్సీ వారు అక్రమాలకు పాల్పడినట్లు నిర్ధారించినట్లు తెలిపారు. ఈ గ్యాస్ ఏజెన్సీపై జాయింట్ కలెక్టర్ శివ నారాయణ శర్మ, జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్‌కు నివేదికలు అందజేసి వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని డిఎస్ఒ తెలిపారు.

గ్రామస్తులతో మాట్లాడుతున్న డిఎస్ఒ, తదితరులు

# గ్రామాల్లో పడేసిన పారిశుధ్యం

**ప్రజాశక్తి - ఆత్మకూరు**

మండలంలోని పలు గ్రామపంచాయతీల్లో పారిశుధ్యం పడకేసింది. ఆయా గ్రామాల్లో పరిశుభ్రత, మండల ప్రజారోగ్యం ప్రశ్నార్థకంగా మారుతోంది. ఏ గ్రామ పంచాయతీలో చూసినా మురుగుగుంతలు దర్శనమిస్తున్నాయి. రోడ్లపై మురుగు పారుతోంది. డ్రయినేజీలు కంపు కొడుతున్నాయి. ఫలితంగా దోమలు అధికమై సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. ఇంతజరుతున్నా సంబంధిత పంచాయతీ, వైద్య శాఖ అధికారులు పట్టించుకోవటం లేదన్న విమర్శలు వినపడుతున్నాయి. మురుగునీటిపై బ్లీచింగ్, క్లోరినేషన్ చేయడంలేదు. కనీసం మురుగు కాలువలపై వేస్ట్ ఆయిల్, బ్లీచింగ్ పౌడర్ కూడా చల్లడం లేదన్న ఆరోపణలు ఆయా గ్రామాల్లో బలంగా వినిపిస్తున్నాయి. ఏది ఏమైనా పారిశుధ్యంపై దష్టిసారించాల్సిన అధికారులు ఆదిశగా చర్యలు చేపట్టడంలేదని తెలుస్తోంది. దీంతోపాటు ఆయా గ్రామాల్లో అంతర్గత రహదారులు పూర్తిగా దెబ్బతింటున్నాయి. ఫలితంగా ఆయాచోట్ల మురుగుగుంతలు ఏర్పడి దోమలకు నిలయంగా మారాయి. దీంతో ప్రజారోగ్యం అందోళనకరంగా మారింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పారిశుధ్య వ్యవస్థను చక్కదిద్దాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. దోమలు మురికి గుంటలను ఆవాస ప్రాంతాలుగా ఏర్పాటు చేసుకుని విజంభిస్తున్నాయి. కొన్ని గ్రామాల్లో డ్రైనేజీలు నిర్మించిన పూడిక తీయ్యకపో వడంతో సమస్య ఏర్పడుతున్నది. ఇప్పటికైనా అధికారులు గ్రామాల్లో పారిశుధ్య నిర్మూలనా చర్యలు చేపట్టి రోగాల బారిన పడకుండా ప్రజారోగ్యాన్ని పరిరక్షించాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్డుపై నిలిచిన మురుగునీరు

# నిజాంను వారంలో తీసుకొస్తాం

## సౌదీ బాధితుడితో మాట్లాడిన ఎమ్మెల్యే దగ్గుపాటి

**ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్**

ఉపాధి కోసం సౌదీ దేశానికి వెళ్లి అక్కడ చిక్కుకున్న అనంతపురానికి చెందిన నిజాంను వారంరోజుల్లో స్వస్థలానికి తీసుకొస్తామని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. నగరంలోని ఆజాద్‌నగర్‌కు చెందిన నిజాం రెండు నెలల క్రితం ఉపాధి కోసం సౌదీ దేశానికి వెళ్లారు. అక్కడ ఓ ఇంట్లో డ్రైవర్‌గా చేరిన తర్వాత వేధింపులు మొదలయ్యాయి. ఓనర్లు నిత్యం దాడి చేస్తూ చిత్రహింసలకు గురిచేశారు. చివరకు అతన్ని బయటికి నెట్టివేయడంతో సౌదీలో కనీసం తినేందుకు తిండి కూడా లేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. చివరకు ఓ వీడియో సందేశం ద్వారా తన ఆవేదనను వెల్లడించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి తనను రక్షించాలని వేడుకున్నారు. ఈ వీడియో వైరల్‌గా మారడంతో అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ వెంటనే స్పందించారు. నగరంలోని ఆజాద్‌నగర్‌లో ఉన్న నిజాం ఇంటికి టిడిపి నాయకులతో కలసి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. నిజాం సతీమణి రేష్మ కు ధైర్యం చెప్పారు. వెంటనే తన స్నేహితుల ద్వారా సౌదీలోని జెడ్డాలో ఉన్న నిజాంను కలిసేలా చేశారు. అనంతరం వారి ద్వారా ఆంధ్రప్రదేశ్ తెలుగు అసోసియేషన్ వారికి నిజాంను అప్పజెప్పారు. జెడ్డా నుంచి సౌదీ రాజధాని రియాద్‌కు నిజాంను తీసుకొచ్చారు. అక్కడ నుంచి అనంతపురం తీసుకొచ్చేందుకు అవసరమైన అన్ని అంశాలు అధికారులతో మాట్లాడారు. అయితే నిజాం ఎందుకు సౌదీకి వెళ్లారన్నా అంశాలను ఎమ్మెల్యే దగ్గుపాటి ఆరా తీశారు. గతంలో పదేళ్లపాటు సౌదీలో డ్రైవర్‌గా పని చేసేవారని.. తిరిగి అనంతపురం వచ్చి ఇక్కడే ఉన్నారని తెలిపింది. ఇటీవల తమ కుమారుడికి కిడ్నీ ఆపరేషన్ చేయడం వల్ల రూ.12లక్షలు అప్పులు అయ్యాయన్నారు. వీటిని తీర్చేందుకు మళ్లీ రెండు నెలల క్రితం ఆయన సౌదీకి వెళ్లినట్లు వివరించారు. ఈ సంఘటనపై వెంటనే స్పందించిన ఎమ్మెల్యే దగ్గుపాటి వైద్య ఖర్చులకు అయిన సొమ్మును సీఎంఆర్ఎఫ్ ద్వారా అందించే ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే సొంత ఇల్లు కూడా మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. నిజాం ఇబ్బందుల గురించి తెలిసిన వెంటనే మంత్రి నారా లోకేష్ ఢిల్లీలో బిజీగా ఉన్నప్పటికీ తన కార్యాలయ సిబ్బందిని తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు తెలిపారు. ఇప్పటికే నారా లోకేష్ కార్యాలయ సిబ్బంది కూడా నిజాంతో మాట్లాడారని తెలిపారు. కచ్చితంగా వారం రోజుల్లోపు అనంతపురం తీసుకొస్తామని వారి కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గౌస్ మోద్దిన్, రాయల్ మధు, సరిపుటి రమణ, సుధాకర్ యాదవ్, నారాయణస్వామి యాదవ్, బొమ్మినేని శివ, తాజుద్దీన్,జనబలం బాబా, ఫిరోజ్ అహ్మద్, చేపల హరి, ఇస్మాయిల్, పూల భాష, ఓంకార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నిజాం కుమారుడితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

# 15 వరకు రేషన్ సరుకులు పంపిణీ : జెసి

**ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్**

జిల్లాలోని రేషన్ దుకాణాల్లో ప్రతినెలా 1 నుంచి 15వతేదీ వరకూ నిత్యావసరాలు పంపిణీ చేయనున్నట్లు జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్‌శర్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 6,62,014 రైస్ కార్డుదారులకు సరిపడా నిత్యావసర సరుకులు 1,645 చౌకధరల దుకాణాలకు కేటాయించామన్నారు. డీలర్లు ఆయా రోజుల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12, తిరిగి సాయంత్రం 4 నుంచి రాత్రి 8.00 గంటల వరకూ దుకాణాల్లో బియ్యం పంపిణీ చేయాలన్నారు. కార్డుదారులు తమకు దగ్గరలోని ఏ చౌక దుకాణం వద్దనైన సరుకులు పొందవచ్చన్నారు. అలాగే 65ఏళ్ల పైబడిన, వికలాంగులు, అనారోగ్య కారణంగా మంచానికి పరిమితమైన కార్డుదారులకు వారి ఇళ్ల వద్దకే వెళ్లి సరుకులు అందజేయాలన్నారు.

# 'నక్ష'పై వీడని నిర్లక్ష్యం

అనంతపురం నగరపాలక సంస్థ కార్యాలయం

**ప్రజాశక్తి - అనంతపురం కార్పొరేషన్**

రాష్ట్ర ప్రభుత్వం పట్టణ, మున్సిపాలిటీ, నగర పాలకసంస్థల్లో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నక్ష సర్వే అధికారుల నిర్లక్ష్యంతో అనంతపురం నగర పాలకసంస్థలో పూర్తిస్థాయిలో జరగలేదు. నక్ష(పట్టణ నివాసాల యొక్క జాతీయ జియో స్పేషియల్ నాలెడ్జ్ ఆధారిత భూసర్వే) అనంతపురం నగరపాలక పరిధిలో సోమవారం సాయంత్రానికి 84శాతం మాత్రమే పూర్తి అయింది. మిగిలిన 16 శాతం సర్వే పూర్తి కావటానికి మంగళవారం ఒక్కరోజు మాత్రమే ఆఖరి గడువుగా మిగిలింది. ఆ ఒక్క రోజులోనే 16శాతం సర్వే పూర్తి చేసి సమగ్ర నివేదిక పంపటం సాధ్యమవుతుందా అన్న ప్రశ్నకు ఆ శాఖ అధికారుల నుంచి ఆ ఒక్కటి అడక్కు అన్న సమాధానమే ఎదురవుతోంది. ఈ బాధ్యతరాహిత్యానికి నిర్లక్ష్యానికి బాధ్యులు ఎవరని ప్రశ్నిస్తే అన్నింటికీ ఆ ఒక్క అధికారి వైపే చూపుడు వేలు చూపుతోందని ప్లానర్స్, ఉద్యోగులు వ్యాఖ్యానిస్తున్నారు. అధిక పని భారం కారణంగా సర్వే పూర్తి చేయలేకపోతున్నామని ఈ విషయాలను సెప్టెంబర్ మొదటి వారంలోనే టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ దృష్టికి తీసుకువచ్చినా స్పందన కరువైందని దీంతో కమిషనర్ కు ఫిర్యాదు చేసిన ఆశించిన ఫలితం రాలేదని సర్వే ఉద్యోగులు చెబుతున్నారు. దీనికి బాధ్యత వహించేది ఎవరు అన్న ప్రశ్నకు మౌనమే సమాధానంగా మిగులుతుంది

మున్సిపల్ పరిపాలన శాఖ డైరెక్టర్ సంపత్ కుమార్ అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ పర్యటన సందర్భంగా సెప్టెంబర్ 29వ తేదీ నాటికి నక్ష సర్వే ప్రోగ్రాం పూర్తిచేసి తీరాలని స్పష్టం చేశారు. డిఎంఎ పర్యటన ఆగస్టు ఆఖరి వారంలో జరిగింది. నెల రోజుల కు పైగా సమయం ఉన్నప్పటికీ నిర్ణీత కాలవ్యవధిలో నక్ష సర్వే పూర్తి చేయలేకపోవటానికి గల కారణాలను పరిశీలిస్తే టౌన్ ప్లానింగ్ అధికారికి సచివాలయ ప్లానర్స్‌కు మధ్య సమన్వయము కొరవడటమేనని తెలుస్తోంది. నగరంలోని 10 సచివాలయాల ప్లానర్స్‌కు ఇన్‌ఛార్జిల బాధ్యత అదనంగా ఉండటంతో అధిక పని భారం ఎక్కువైంది. దీనికి తోడు అసెస్మెంట్ దార్ల సంఖ్య అధికంగా ఉండటం కూడా ప్రధాన కారణంగా పేర్కొంటూ అదనంగా తక్కువ పని భారం కలిగిన ప్లానర్స్‌ను అసిస్టెన్స్‌గా నియమిస్తే త్వరితగతిన నక్ష సర్వే పూర్తి చేయటానికి వీలవుతుందని సెప్టెంబర్ 18 వ తేదీన నిర్వహించిన కమిషనర్ సమీక్ష సమావేశంలో ప్లానర్స్ స్పష్టం చేశారు. ఈ సమస్యలను సెప్టెంబర్ మొదటి వారంలోనే లిఖిత పూర్వకంగా టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ శిరీష దృష్టికి తీసుకెళ్లామని వారు పేర్కొన్నారు అయినప్పటికీ అధిక అసెస్మెంట్ లు ఉన్న సచివాలయాలకు అసిస్టెంట్ కేటాయించకపోవడంతో సకాలంలో సర్వే పూర్తి చేయలేకపోతున్నామని ప్లానర్స్ తమ నిస్సహాయతను వ్యక్తం చేస్తున్నారు. అలాగే అధిక పని భారం మోస్తున్న ప్లానర్లు కమిషనర్ కు ఫిర్యాదు చేయడంపై టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ శిరీష అసంతృప్తి వ్యక్తం చేస్తూ మూడు రోజులపాటు విధులకు హాజరు కాలేదు. మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో అప్లోడింగ్ పనులు నిర్వహించే సిబ్బందిని సైతం ఫోన్లు స్విచ్ ఆఫ్ చేసుకుని విధులకు హాజరు కాకుండా ఉండాలని సూచించడంతో వారు కూడా సహాయ నిరాకరణ పాటించారు. దీంతో సర్వే నిర్వహించే ప్లానర్స్ పనులకు ఆటంకం ఏర్పడింది. ఇదే సందర్భంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి సైతం టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ డుమ్మా కొట్టటంతో ఇదేమని ప్రశ్నించి చర్యలు చేపట్టే నాథుడు కన్పించలేదు. ఈ అంశంపై బహిరంగ విమర్శలు రావటంతో టౌన్‌ప్లానింగ్ అధికారి మంగళవారం విధులకు హాజరయ్యారు. ప్రభుత్వ ఉద్యోగిగా ఉంటూ బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిన అధికారిపై క్రమశిక్షణ చర్యలు చేపట్టకపోవడంతో నక్ష సర్వే నిర్ణీత కాల వ్యవధిలో పూర్తి చేయలేని పరిస్థితి నెలకొందని ఉద్యోగ వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి. మంగళవారం నక్ష సర్వే నివేదిక సమర్పించడానికి ఆఖరి గడువు అని సర్వే సిబ్బంది చెబుతున్నారు. దసరా పండుగ సమీపించటంతో పైనుంచి క్రింది వరకు అధికారులు, ఉద్యోగులంతా తమ కుటుంబాలతో గడపటానికి వెళ్లిపోయారు. దీంతో మంగళవారం సాయంకాలానికి మిగిలిన 16 శాతం సర్వే పూర్తి చేసి ఒక్క రోజులోనే నివేదిక పంపడం సాధ్యకాదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయాన్ని సంబందిత అధికారుల వద్ద ప్రస్తావిస్తే ఆ ఒక్కటి అడక్కు అంటూ వ్యాఖ్యానించడం గమనార్హం.

## మంగళవారానికి ముగిసిన గడువు

## బాధ్యులపై చర్యలకు మీనమేషాలు



# ధన్వంతరి జయంతిని అధికారికంగా నిర్వహించండి

## మంత్రి సవితమ్మకు నాయీబ్రాహ్మణ ఉద్యోగుల సంఘం నేతల వినతి

మంత్రి సవితమ్మను సన్మానిస్తున్న నాయీబ్రాహ్మణ ఉద్యోగుల సంఘం నేతలు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

వైద్య నారాయణుడు, నాయీ బ్రాహ్మణుల కులదైవం ధన్వంతరి జయంతి వేడుకలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని నాయీ బ్రాహ్మణ ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు కోరారు. ఈమేరకు రాష్ట్ర వెనకబడిన తరగతుల సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మను మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందిస్తూ అతిత్వరలో ప్రభుత్వం నుంచి జీవో వచ్చే విధంగా చొరవ తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయీ బ్రాహ్మణ సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు సుబ్రమణ్యం, అధ్యక్షులు వెంకటరంగయ్య, కార్యదర్శి శివశంకర్, గౌరవ సలహాదారులు శివప్రసాద్, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు ఉమామహేశ్వరి, నాగరాజు, రాష్ట్ర కార్యదర్శి విజయనగరం, నాగరాజు, అర్గనైజింగ్ సెక్రెటరీ ఆర్టీసీ శ్రీనివాసులు, అనంతపురం రూరల్ ఎంపిడిఓ దివాకర్, తదితరులు పాల్గొన్నారు.

# దూదేకుల భవన్ అభివృద్ధికి నిధులు కేటాయించాలని వినతి

వినతిపత్రం అందజేస్తున్న దూదేకుల సంఘం నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం

దూదేకుల భవన్, చమన్ ఫంక్షన్ హాల్ అభివృద్ధికి నిధులు కేటాయించాలని చమన్ కుమారుడు, నూర్ బాషా, దూదేకుల సంక్షేమ సంఘం జిల్లా నాయకులు, రాష్ట్ర అధికార ప్రతినిధి ఉమర్ ముక్తాయర్ కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే పరిటాల సునీతను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన తండ్రి ఆశయాల్లో భాగమైన దూదేకుల భవన్, చమన్ ఫంక్షన్ హాల్ అభివృద్ధికి చేసేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగానే ఎమ్మెల్యే సునీతతోపాటు ఎంపి బికె పార్థసారధిని కలిసి విన్నవించినట్లు తెలిపారు. ఇందుకు వారిద్దరూ సానుకూలంగా స్పందించి తప్పకుండా సహకారం అందిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు ఖాసీం, ప్రధాన కార్యదర్శి మహబూబ్ సాహెబ్, ట్రెజరర్ ఖాసీం, సిండికేట్ నగర్ అల్లీపీరా, చాంద్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ కార్మికులకు దుస్తులు పంపిణీ

కార్మికులకు దుస్తులు పంపిణీ చేస్తున్న వైసిపి నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం

నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నగరంలోని హెచ్ఎల్సీ కాలనీలో మున్సిపల్ కార్మికులకు కార్పొరేటర్ శేఖర్‌బాబు, బిందుప్రియ దంపతులు దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ముందుగా నసనకోట ముత్యాలమ్మ ఆలయంలో పూజలు చేశారు. అనంతరం కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వెన్నం శివారెడ్డి, బూత్ కమిటీ విభాగం రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణ, క్రిస్టియన్, మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శి జానీ, నగర అధ్యక్షులు చింతా సోమశేఖర్‌రెడ్డి, భూత్ కమిటీ విభాగం జిల్లా అధ్యక్షులు అమర్‌నాథ్‌రెడ్డి, మైనార్టీ విభాగం నగర ఉపాధ్యక్షులు ఆసిఫ్, నాయకులు పాటిల్ తిమ్మారెడ్డి, రఘునాథ్‌గౌడ్, శేఖర్, హర్షద్, తదితరులు పాల్గొన్నారు.

**ఓంకార్‌రెడ్డి ఆధ్వర్యంలో...**

**అనంతపురం కార్పొరేషన్ :** ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ స్ఫూర్తితో అనంతపురం అర్బన్ 42వ డివిజన్ టిడిపి ఇన్‌ఛార్జి ఓంకార్‌రెడ్డి మున్సిపల్ కార్మికులకు మంగళవారం దుస్తులు, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు డి.రామాంజనేయులు, 1వ రోడ్డు శివాలయం డైరెక్టర్ బోయ శ్రీనివాసులు, మెడికల్ బాబా, కురుబ సంజీవ్ కుమార్, డిమ్ బాషా, చాకలి సురేష్, చంద్రమౌళినాయుడు, కుమ్మరి విజయ్‌కుమార్, భాస్కర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు దుస్తులు పంపిణీ చేస్తున్న ఓంకార్‌రెడ్డి

# ఎమ్మెల్యేను కలిసిన సిఐ హరినాథ్

ఎమ్మెల్యేకు బొకే అందజేస్తున్న సిఐ

**కళ్యాణదుర్గం రూరల్ :** పట్టణ సీఐగా బాధ్యతలు చేపట్టిన సిఐ హరినాథ్ మంగళవారం పట్టణంలోని ఎమ్మెల్యే గారి స్వగృహంలో ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబును మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బొకే అందజేశారు.

## 3న మండల సర్వసభ్య సమావేశం

**పామిడి :** స్థానిక మండల ప్రజా పరిష్యత్ కార్యాలయ సభా భవనంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపిడిఓ తేజోష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో విద్య, వైద్యం, ఉపాధి, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్, వ్యవసాయం, గృహాలు, రోడ్లు వంటి అంశాలపై చర్చించనున్నట్లు చెప్పారు. సమావేశానికి ఆయా శాఖల మండల అధికారులు, సర్పంచులు, కార్యదర్శులు తప్పనిసరిగా హాజరు కావాలని ఎంపిడిఓ కోరారు.

## తాడిపత్రి మార్కెట్ యార్డు డైరెక్టర్‌గా జూటూరు షహరాబాను

**యాడికి :** యాడికి మండల కేంద్రానికి చెందిన సామాజికవేత్త, స్టాంప్‌రైటర్ జూటూరు రజాక్ సతీమణి షహరాబాను తాడిపత్రి మార్కెట్ యార్డు డైరెక్టర్‌గా నియమితులయ్యారు. ఈమేరకు ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి ఆదేశాలతో మార్కెట్ అధికారులు మంగళవారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో మండల ప్రజలు, ముస్లిములు హర్షం వ్యక్తం చేశారు.

## పింఛన్ల పంపిణీలో పాల్గొనండి

**పామిడి :** నేడు మండలంలో చేపట్టనున్న పింఛన్ల పంపిణీలో కూటమి నాయకులు, కార్యకర్తలు తప్పనిసరిగా పాల్గొనాలని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం మంగళవారం ఒక ప్రకటనలో సూచించారు. అంతేగాకుండా పింఛన్ల పంపిణీలో పాల్గొన్న ఫొటోలను టిడిపి యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు.

## ఎన్ఎంఎంఎస్ టెస్ట్‌కు దరఖాస్తులు ఆహ్వానం

**కొత్తచెరువు :** డిసెంబర్ 7వ తేదీ నిర్వహించే నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్ఎంఎంఎస్) పరీక్షకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని డిఇఒ జి.కృష్ణప్ప మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. అప్లికేషన్ ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంటుందన్నారు. స్టేట్ బ్యాంకులో చలానా తీసిన రశీదుతో పాటు దరఖాస్తును డిఇఒ కార్యాలయంలో అక్టోబర్ 18వ తేదీ లోపు అందజేయాలన్నారు.

**IN THE COURT OF THE IInd ADDL JUNIOR CIVIL JUDGE (MOBILE COURT):ANANTHAPURAMU**
**O.S.No:239/2024**
**Between:**
K.Hima Bindu ...Plaintiff
V/s
P.David onesimos ...Defendant
**NOTICE TO DEFENDANT**
**To,**
P.David onesimos S/o P.Jayanandam,
D.No:11-1-188, IIIrd Cross, Aravinda Nagar,
Ananthapuramu Town.
పై నెంబరు దావాలోని ప్రతివాది అయిన మీ హాజరు నిమిత్తము పై కోర్టువారు 06-10-2025వ తేది నాడు వాయిదా వేసినారు. కావున ఆరోజు ఉదయం 10:30 గంటలకు మీరు స్వయంగా గానీ లేక వకీలు ద్వారా గానీ హాజరై ఏమైనా ఆక్షేపణలు ఉన్న యెడల తెలుపుకొనవలెను. అట్లు హాజరు కానీ యెడల పై కేసు మీ పరోక్షమునందు తీర్మానించబడును అని తెలియజేయడమైనది.
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
**J.CHITTARANJAN,**
Advocate, Ananthapuramu,
Cell No: 9440222366

# ఆటంకం లేకుండా వైద్యసేవలు అందించాలి

## డిఎంహెచ్ఓ డాక్టర్ ఇబి. దేవి

కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న డిఎంహెచ్ఓ డాక్టర్ ఇబి దేవి

ప్రజాశక్తి-అనంతపురం

సర్వీసు నిబంధనల్లో మార్పులు చేయాలని కోరుతూ జిల్లాలోని 45 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పని చేస్తున్న వైద్యులు మంగళవారం నుంచి సమ్మెలోకి వెళ్లిన నేపథ్యంలో ప్రజలకు అందించే వైద్యసేవలను మాత్రం యథావిధిగా కొనసాగించాలని డిఎంహెచ్ఓ డాక్టర్ ఇబి దేవి వైద్య సిబ్బందికి సూచించారు. మంగళవారం నగరంలోని కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాలోని వైద్యసిబ్బందితో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాలు మేరకు తాత్కాలికంగా వైద్య పరిషత్ ఆసుపత్రుల్లో పని చేస్తున్న 28 మంది, ప్రభుత్వ వైద్య కళాశాల పరిధిలో పని చేసే మరో 26 మంది వైద్యులను ప్రభుత్వం నియమించిందన్నారు. వీరందరూ వివిధ ప్రాథమిక వైద్య కేంద్రాలకు నియమిస్తూ ఆదేశాలు జారీ చేసినట్లు వివరించారు. వీరు అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న పారామెడికల్ సిబ్బందిని కలుపుకొని ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ విధులు నిర్వహించి ప్రజలకు సేవలు అందించాలన్నారు. అంతేకాకుండా 104 వాహనాల్లో పని చేస్తున్న సిబ్బంది ఆయా ప్రాథమిక వైద్య కేంద్రాల్లోనే వైద్యసేవలు అందించాలన్నారు. 108 వాహన వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎక్కడైనా వైద్య సేవలు అందించే విషయంలో నిర్లక్ష్యం, ఇబ్బందులు తలెత్తితే వెంటనే చర్యలు చేపట్టడానికి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో కంట్రోల్ రూము ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాంటి పరిస్థితుల్లో 08554-235603 ల్యాండ్ లైన్ నంబర్‌కు ఫోన్ చేయవచ్చని తెలిపారు.

# ఓట్ల దొంగలను గద్దెదించే వరకు పోరాటం

## 'ఓట్ చోర్ - గద్దె చోడ్'లో కాంగ్రెస్ నాయకులు

సంతకాలు సేకరిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

కేంద్రంలోని బిజెపి ఓట్ల దొంగలను గద్దె దించేంత వరకూ తమ పోరాటం ఆగదని కాంగ్రెస్ పార్టీ నాయకులు స్పష్టం చేశారు. 'ఓట్ చోర్ - గద్దె చోడ్' కార్యక్రమంలో భాగంగా మంగళవారం పట్టణంలోని టి సర్కిల్‌లో సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి రాంభూపాల్‌రెడ్డి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా బిజెపి నాయకులు ఓట్ల చోరీకి పాల్పడుతూ అధికారం చేపడుతున్నారన్నారు. ఈనేపథ్యంలో రాహుల్‌గాంధీ పోరాటానికి మద్దతును కూడగట్టి బిజెపి చేస్తున్న ఓట్ల చోరీని దేశవ్యాప్తంగా విస్తృతంగా ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సంతకాల సేకరణ చేపట్టినట్లు వివరించారు. బిజెపిని గద్దె దించి రాజ్యాంగం, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాల ఎర్రిస్వామి, బ్రహ్మసముద్రం, శెట్టూరు, కుందుర్పి, కళ్యాణదుర్గం మండలాల కన్వీనర్లు కృష్ణమూర్తి, గోవిందప్ప, మర్రిస్వామి, తిమ్మరాజు, నాయకులు ఈశ్వర్‌ప్రసాద్, కరెంటు గోవిందప్ప, కరీంసాబ్, వెంకటరమణ, సురేష్, తమ్మన్న, మంజునాథ్, రవికుమార్, హనుమంతురాయుడు, లింగన్నయాదవ్, పరమేశ్వరప్ప, చిరంజీవి, చాపిరి పరమేష్, మల్లికార్జున, లక్ష్మీనారాయణ, శ్రీరాములు, వెంకటేశులు, నారాయణ, తిమ్మప్ప, వన్నూరుస్వామి, మచ్చన్న, రామూర్తి, శివకుమార్, మారెన్న, కృష్ణమూర్తి, సిద్దప్ప, నారాయణ స్వామి, గిరి, తిమ్మప్ప, వెంకటరమణ, శీనా, రఘు తదితరులు పాల్గొన్నారు.

# అనుమానితులపై అప్రమత్తత అవసరం

## సిఐలు జయనాయక్, వెంకటరమణ

ప్రజాశక్తి-రాయదుర్గం

రాయదుర్గం పట్టణంతోపాటు గ్రామీణ ప్రాంతాల్లో తరచూ దొంగతనాలు జరుగుతున్న నేపథ్యంలో అనుమానితులు, కొత్త వ్యక్తులపై ప్రజలు అప్రమత్తంగా ఉండి పోలీసులకు సమాచారం అందించాలని రాయదుర్గం పోలీస్ ఇన్స్‌పెక్టర్లు జయనాయక్, వెంకటరమణ మంగళవారం ఒక ప్రకటనలో సూచించారు. ఇటీవల కాలంలో పలు నివాస ప్రాంతాల్లో గుర్తు తెలియని వాహనాలు తిరుగుతున్నట్లు తెలిసిందన్నారు. రాత్రి సమయంలో అపరిచిత వాహనాలు, వ్యక్తులను గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఇళ్ల తలుపులు, కిటికీలు, వాహనాలను సురక్షితంగా లాక్ చేయాలన్నారు. పిల్లలు, మహిళలు, వృద్ధులు ఒంటరిగా బయటకు వెళ్లకూడదన్నారు. ఆయా ప్రాంతంలో సీసీ కెమెరాలు, వీధిదీపాలు సక్రమంగా పని చేస్తున్నాయో లేదో పరిశీలించాలన్నారు. దసరా సెలవుల నిమిత్తం రాయదుర్గం రూరల్, పట్టణ పట్టణంలో నివసించే ప్రజలు సుదూర ప్రాంతాలకు వెళ్లే సందర్భంలో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలన్నారు. బస్టాండు, రైల్వేస్టేషన్, ఆటోస్టాండ్లు, బహిరంగ ప్రదేశాల్లో సంచరించే సమయంలో తమ విలువైన వస్తువులపై జాగ్రత్త వహించాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, ప్రయివేట్ వాణిజ్య కూడళ్లు, బ్యాంకులు, గోల్డ్, మార్కెట్, ఇతర వ్యాపార దుకాణాల వద్ద కొనుగోలు చేసే సందర్భాల్లో భద్రత కల్పించుకోవాలన్నారు. ఏవైనా అనుమానాస్పద పరిస్థితులు గమనించినట్లయితే వెంటనే 100, పోలీస్‌స్టేషన్ నంబర్లు 9440901869, 9440796825కు కాల్ చేయాలని సూచించారు.

**చట్టాలపై అవగాహన పెంచుకోవాలి**

**రాయదుర్గం రూరల్ :** ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని రాయదుర్గం సిఐ జయనాయక్ సూచించారు. మంగళవారం మండల పరిధిలోని చదం గ్రామంలో చట్టాలు, హక్కులపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ నేరాలు, మహిళలపై లైంగిక దాడులు, చైల్డ్ మ్యారేజ్, ట్రాఫిక్, పేకాట, మట్కా, బెట్టింగ్‌లకు దూరంగా ఉండాలన్నారు. పొలాల్లో, గృహాల్లో ఉన్న విలువైన వస్తువులు పట్ల జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గ్రామంలో అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తుంటే తక్షణ రాయదుర్గం పోలీసులకు సమాచారం అందించాలన్నారు. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

చదం గ్రామంలో అవగాహన కల్పిస్తున్న సిఐ జయనాయక్

# అధైర్య పడొద్దు..అండగా ఉంటాం..

## డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ ఆవిష్కరణలో వైసిపి నేతలు

కుందుర్పిలో డిజిటల్ బుక్ కూఆర్ కోడ్ ప్రతులను ఆవిష్కరిస్తున్న వైసిపి నాయకులు

ప్రజాశక్తి-కుందుర్పి

కూటమి నాయకుల దౌర్జన్యాలు, అరాచకాలకు వైసిపి నాయకులు, కార్యకర్తలు భయపడొద్దని అండగా ఉంటామని ఆ పార్టీ మండల కన్వీనర్ కె.హనుమంతురాయుడు భరోసా ఇచ్చారు. మంగళవారం మండల కేంద్రంలోని వైఎస్ఆర్ విగ్రహం వద్ద డిజిటల్ బుక్ కూఆర్ కోడ్ ప్రతులను వైసిపి నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రోజురోజుకీ అరాచకాలు పెరిగిపోతున్నాయన్నారు. ముఖ్యంగా వైసిపి నాయకులు, కార్యకర్తలను లక్ష్యంగా చేసుకుని దాడులు, కేసులు పెడుతున్నారన్నారు. అలాంటి బాధితులకు అండగా అధినేత జగన్ డిజిటల్ బుక్‌ను తీసుకొచ్చారన్నారు. ఈ బుక్‌లో నమోదైన వారికి తమ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే న్యాయం చేస్తారన్నారు. కావున వైసిపి నాయకులు, కార్యకర్తలు అధైర్య పడకుండా కూటమి అరాచకాలను అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి భీమరెడ్డి, మండల ఉపాధ్యక్షులు భీమప్ప, మాజీ వాల్మీకి డైరెక్టర్ పాలాక్షి, సర్పంచులు మారుతీశ్వర రామమూర్తి, మసాలా జగన్, గంగాధర్, వెంకటేశులు, అతావుల్లా, బాబు, ఐటీ విభాగం నరేష్, కురుబ సంఘం మాజీ అధ్యక్షులు గోపాల్, మాజీ ఎంపిటిసి మంజునాథ, తేనగల్లు శ్రీనివాసులు, మహంతపురం ఈరన్న, తదితరులు పాల్గొన్నారు.

**బెలుగుప్ప :** వైసిపి కార్యకర్తల్లో మనోధైర్యాన్ని నింపడానికి అధినేత జగన్ డిజిటల్ బుక్ తీసుకొచ్చారని మండల వైసిపి నాయకులు అన్నారు. ఈమేరకు మంగళవారం మండల కేంద్రంలోని వైసిపి కార్యాలయంలో డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ ప్రతులను వైసిపి నాయకులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు చిన్నమచ్చన్న, మాజీ సింగిల్‌విండో అధ్యక్షులు శివలింగప్ప, నాయకులు శ్రీనివాసులు, పురుషోత్తం, కరుణాకర్, వెంకట్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, నరసింహారెడ్డి, నరిగన్న, కుళ్లాయప్ప, భరత్‌రాజు, చిన్న, తదితరులు పాల్గొన్నారు.

బెలుగుప్పలో కూఆర్ కోడ్ ప్రతులను ఆవిష్కరిస్తున్న వైసిపి నాయకులు

కలెక్టర్ ఓ.ఆనంద్‌ను సన్మానిస్తున్న ఎంఆర్‌పిఎస్ నాయకులు

# ఆర్డీటీని కాపాడాలని వినతి

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

జిల్లాలో వరప్ర ధాయినిగా ఉన్న రూరల్ డెవలప్‌మెంట్ సంస్థ (ఆర్డీటీ)ని కాపాడాలని ఎంఆర్‌పిఎస్ నాయకులు కోరారు. ఈమేరకు మంగళవారం నగరంలోని కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ ఓ.ఆనంద్‌ను మర్యాదపూర్వకంగా కలిసి ఆర్డీటీని కాపాడేందుకు చర్యలు చేపట్టాలని వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుళ్లాయప్ప, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు నేరిమెట్ల యల్లన్న, నాయకులు తిమ్మరాజులు, దాసంపల్లి రవి, తదితరులు పాల్గొన్నారు.

# సిఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి-ఆత్మకూరు

నియోజకవర్గంలోని దాదాపు 29 మంది లబ్ధిదారులకు సిఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.38.27 లక్షల చెక్కులను మంగళవారం వెంకటాపురంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పరిటాల సునీతమ్మ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో అనారోగ్యానికి గురై స్థోమతకు మించి అప్పులు చేసి ప్రయివేటు, కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకున్న బాధితులకు సిఎం సహాయ నిధి వరం అన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు టిడిపి మండల కన్వీనర్ శ్రీనివాసులు, నాయకులు శశాంక్‌చౌదరి, కందుల ఓబుళపతి, పూల ఓబుళపతి, అక్కులన్న, రాందాస్, బాబా, తదితరులు పాల్గొన్నారు.

సిఎం ఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

ప్రజాశక్తి కథనానికి స్పందన

# బోర్డు వచ్చేసిందోచ్..

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

ఎట్టకేలకూ పెద్దవడుగూరు వ్యవసాయ శాఖ కార్యాలయానికి బోర్డు ఏర్పాటు చేశారు. స్థానిక విద్యుత్ శాఖ కార్యాలయం పైగదిలో వ్యవసాయ శాఖ కార్యాలయం నిర్వహిస్తున్నారు. అయితే బోర్డు లేనందున కార్యాలయం ఉన్నట్లు చాలామందికి తెలిసేది కాదు. ఈనేపథ్యంలో 'వ్యవసాయ శాఖ కార్యాలయం ఎక్కడ' అనే శీర్షికతో ప్రజాశక్తి దినపత్రికలో కథనం ఇటీవల వెలువడిన సంగతి విదితమే. కథనానికి స్పందించిన సంబంధిత అధికారులు కార్యాలయంపై బోర్డును ఏర్పాటు చేశారు. దీంతో రైతులు 'బోర్డు వచ్చేసిందోచ్' అని చెప్పుకుంటూ హర్షం వ్యక్తం చేశారు.

కార్యాలయానికి ఏర్పాటు చేసిన బోర్డు

# నార్పలలో ఎఆర్ వస్త్ర దుకాణం ప్రారంభం

ప్రారంభమైన ఎఆర్ వస్త్ర షోరూం

ప్రజాశక్తి-నార్పల

మండల కేంద్రంలోని గూగూడు రోడ్డులో గూగుల్ రోడ్డులో డిపో వారి ఎఆర్ నూతన వస్త్ర షోరూమ్‌ను మంగళవారం అట్టహాసంగా ప్రారంభించారు. దాదాపు 40ఏళ్ల నుంచి వస్త్ర వ్యాపార రంగంలో అపార అనుభవం ఉండి మండల ప్రజలందరికీ సుపరిచితులైన డిపో మహబూబ్‌పీరా తనయులు మహమ్మద్, షంసోద్దీన్, రసూలిల్లా నార్పలలో నూతనంగా మరో షోరూమ్‌ను ప్రారంభించడం విశేషం. ఈ సందర్భంగా నిర్వాహకులు రసూలిల్లా మాట్లాడుతూ తమ దుకాణంలో మహిళలు, పురుషులు, యువకులు, విద్యార్థులు చిన్న పిల్లలు అందరికీ అన్నిరకాల వస్త్రాలు సరసమైన ధరలకు లభిస్తాయన్నారు. అన్నిరకాల రెడీమేడ్ దుస్తులు అందుబాటులో ఉన్నాయన్నారు. కావున వినియోగదారులు తమ దుకాణానికి వచ్చి నూతన వస్త్రాలు కొనుగోలు చేసి సహకారం అందించాలని కోరారు.

## నేరాలు ఘోరాలు

# చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

జమేదారుకు వినతిపత్రం అందజేస్తున్న రామాంజనేయ కుటుంబ సభ్యులు, కురుబ కులస్తులు

ప్రజాశక్తి-బొమ్మనహాల్

విద్యుత్ ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న మండల కేంద్రంలోని సచివాలయంలో విద్యుత్ జెఎల్‌టిగా పని చేస్తున్న రామాంజనేయులు కురుబ చికిత్స పరిస్థితి విషమించి మంగళవారం మృతిచెందాడు. దీంతో కురుబ సంఘం నాయకులు నాగరాజు ఆధ్వర్యంలో స్థానిక కరెంట్ ఆఫీస్ నుంచి పోలీస్‌స్టేషన్ వరకూ ర్యాలీగా వెళ్లిజమేదార్ కమల్‌బాషాకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామాంజనేయులు కుటుంబానికి రూ.50లక్షల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే భార్యకు ఉద్యోగం కల్పించాలని, పిల్లలకు పెన్షన్ ఇవ్వాలని, ప్రమాదానికి కారణమైన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో లేపాక్షి బసవరాజు, ఫొటో స్టూడియో నాగరాజు, ఎంఆర్‌సి మల్లన్న, కురువ కులస్తులు పాల్గొన్నారు.

**కేసు నమోదు**

జెఎల్‌టి రామాంజనేయులు మృతిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నబీరసూల్ తెలిపారు. మృతుడి భార్య కోమలమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు విద్యుత్ శాఖలో పని చేస్తున్న సబ్‌స్టేషన్ ఆపరేటర్ గొల్ల రామాంజనేయులు నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగిందని ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు. ఈమేరకు గొల్ల రామాంజనేయులుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

## సొసైటీ అధ్యక్షుడిపై హత్యాయత్నం

చికిత్స పొందుతున్న కేసన్న

**బుక్కరాయసముద్రం :** బుక్కరాయసముద్రం సహకార సంఘం సొసైటీ అధ్యక్షుడు కేసన్నపై అనంతపురంలో హత్యాయత్నానికి జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. అనంతపురంలోని నీలం టాకీస్ దగ్గర మసీదు సమీపంలో ఉన్న కేసన్న రియల్ ఎస్టేట్ కార్యాలయంలో తమ సమీప బంధువు భూ సమస్యలపై గొడవ పడ్డారు. గొడవ పెరిగి ఒక్కసారిగా కేసన్నపై దాడి చేశారు. వెంటనే స్థానికులు పెద్దాసుపత్రికి తరలించారు. అనంతపురం వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

**తనకల్లు :** టమోటా లోడుతో వెళ్తున్న వాహనం ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న సంఘటనలో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన మంగళవారం మండలంలోని చీకటిమానిపల్లి సమీపంలో చోటు చేసుకుంది. ఎస్ఐ గోపి తెలిపిన వివరాలు.. పాతర్లపల్లి శ్రీనివాసులు(30) ద్విచక్ర వాహనంపై పాతకోట నుంచి సింగిరివాండ్లపల్లికు వెళ్తుండగా అదే సమయంలో ఎంసి తండాకు చెందిన ఆదినారాయణనాయక్‌కు చెందిన టమోటా లోడుతో వెళ్తున్న వాహనం చీకటిమానిపల్లి సమీపంలో ఢీకొంది. ఈ సంఘటనలో శ్రీనివాసులు తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలిసిన వెంటనే ఎస్ఐ గోపి పోలీసు సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన టమోటా లోడుతో వెళ్తున్న వాహనం డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## గాయపడిన యువకుడు..

**గుడిబండ :** వారం రోజుల క్రితం కారు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడిన యువకుడు బెంగళూరులోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా సోమవారం రాత్రి మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. వివరాలు.. మండలంలోని ఎస్.రాయపురం గ్రామానికి చెందిన సద్దాంహుస్సేన్(30) వారం రోజుల క్రితం భార్యాపిల్లలతో కలిసి కర్నాటక రాష్ట్రంలోని సిరా పట్టణం నుంచి ద్విచక్ర వాహనంపై స్వగ్రామం బయల్దేరాడు. మార్గ మధ్యలో అగళి మండలంలోని హుల్లెకెర సమీపంలో మారెమ్మ గుడి వద్ద రోడ్డు పక్కన ద్విచక్ర వాహనాన్ని ఆపి మూత్ర విసర్జన కోసం పక్కనే ఉన్న పొలంలోకి వెళ్లాడు. అదే సమయంలో ఓ కారు అతివేగంగా దూసుకొచ్చి మూత్ర విసర్జన చేస్తున్న సద్దాం హుస్సేన్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సద్దాం హుస్సేన్‌ను బంధువులు బెంగళూరులోని విక్టోరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సద్దాం హుస్సేన్ సోమవారం రాత్రి మృతి చెందాడు. అతడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నట్లు తెలిసింది. యువకుడు మృతితో ఎస్.రాయపురం గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

## పొలాల్లో కేబుల్ వైర్లు చోరీ

ప్రజాశక్తి-బుక్కపట్నం

మండలంలోని గూనిపల్లి గ్రామంలో రైతులు వ్యవసాయ మోటార్లకు బిగించిన కేబుల్ వైర్లు ఇటీవల కాలంలో తరచూ చోరీకి గురవుతున్నాయి. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారు. సోమవారం రాత్రి ఆ గ్రామానికి చెందిన 12 మంది రైతుల వ్యవసాయ బోరు బావులకు సంబంధించిన కేబుల్ వైర్లను గుర్తుతెలియని వ్యక్తులు కట్ చేసి ఎత్తుకెళ్లారు. దీంతో రైతులు పంటలను కాపాడుకునేందుకు నానా అవస్థలు పడుతున్నారు. ఇకనైనా పోలీసు అధికారులు స్పందించి కేబుల్ వైర్ల దొంగలను పట్టుకుని రైతులకు న్యాయం చేయాలని రైతులు కేశప్ప, కిష్టప్ప, నారాయణ స్వామి, రమేష్, రఘునాథ్‌రెడ్డి, తదితరులు కోరుతున్నారు.